

# ధారలుగా కారిన రక్తం వరదలుగా కారిన కన్నీళ్ళు

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

17

"**మీకు తెలుసు. చెప్పాను** యుగంధర్ తత్వం. నా ప్రాణాన్ని కాపాడడం కోసం మీతో బేరానికి రాడు" అన్నాడు రాజు.

డాక్టర్ శ్రీకాంత్ నవ్వాడు, "ఒక ప్రాణం కాదు చాలా ప్రాణాలు. అప్పుడు చూద్దాం. ఏం చేస్తాడో ఆ మేధావి."

"మైడియర్ రాజూ! నువ్వు తలుచుకుంటే యుగంధర్ని ఒప్పించగలవు" అన్నది లాలన.

రాజు ఆలోచిసున్నాడు, ఆలోచనలతో అతని తల వేడెక్కుతోంది. ఇక్కణ్ణించి తప్పించుకోవాలి, ఎలా? డాక్టర్ శ్రీకాంత్ చేతిలో పిస్తోలు లేనిదే మాట్లాడడు. అసలు ఆ యింట్లో ఎంతమంది వున్నారో కూడా తనకు తెలియదు. అయినా తన ప్రయత్నం తను చెయ్యాలి. తప్పించుకోవాలి.

"అవును. నాకు చావడం యిష్టం లేదు. బతుకు మీద తీపి యింకా వుంది. యుగంధర్." అంటూ గదిలో పచారాలు చేస్తూ, శ్రీకాంత్ కుర్చీ దగ్గరకి వెళ్ళాడు. డాక్టర్ శ్రీకాంత్‌కి అనుమానం వేసేలోపున, అతని కుర్చీని ఒక తన్ను తన్నాడు. ఆ తన్నులో తన బలమే కాదు. యుగంధర్ బలం కూడా వుంది. ప్రాణానికి తెగించిన మనిషి, పిచ్చి బలం. శ్రీకాంత్ కుర్చీ తల్లకిందులయింది. పిస్తోలు కిందపడింది అతని చేతిలోంచి. వెంటనే ఒక్క అంగలో రాజు అక్కడికి చేరుకుని, పిస్తోలు తీసుకుని, "ప్లీజ్ లాలన కదలక. నిన్ను చంపడం నాకిష్టంలేదు, అందులోనూ అందమైన ఆడదాన్ని. డాక్టర్! లేచి నిలుచో చేతులు పైకి ఎత్తిపెట్టు" ఆజ్ఞాపించాడు రాజు.

డాక్టర్ శ్రీకాంత్ మొహం ఎర్రనయింది. కళ్ళల్లోంచి నిప్పురవ్వలు రాలుతున్నాయి.

"రాజూ నీకు పిచ్చి పట్టింది. ఈ గదిలోంచి బయటకి అడుగు పెడితే చస్తావు ."

"అవును. ఆలోగా నిన్ను చంపేస్తే" అని పిస్తోలు మీట మీద వేలుపెట్టి నొక్కబోతున్నాడు రాజు. డాక్టర్ శ్రీకాంత్‌కి ఆఖరి క్షణాలు సమీపించాయని తెలుసు.

"కానియ్యి ,యీ వృత్తిలోకి ప్రవేశించిననాడు, నా దేశం కోసం ప్రాణాన్ని..." అంటున్నాడు డాక్టర్.

టెలిఫోన్ మోగింది. "డాక్టర్ దూరంగా జరుగు, నేను" అని రాజు రిసీవర్ తీశాడు. అంతే రిసీవర్ ముట్టుకోగానే ఒళ్ళు జలదరించింది. నరనరాలు పీకేశాయి. దూరంగా వెన్నక్కి వెళ్ళిపడ్డాడు. పడుతున్నప్పుడు చేతిలో పిస్తోలు కిందపడింది. డాక్టర్ శ్రీకాంత్ పిస్తోలు తీసుకుని నవ్వి "యు ఆర్ ఏ  స్టుపిడ్. పైకి ఎనామిల్ కోటింగ్ వున్నా, ఆ టెలిఫోన్ లోహంతో చేసింది. బయట నా వాళ్ళు గ్రహించారు యిక్కడ జరిగింది. నువ్వు టెలిఫోన్ రిసీవర్ తీస్తావని ఊహించారు. తీవ్రమైన ఎలక్ట్రిక్  షాక్ కొట్టింది" అని నవ్వాడు.

"రాజూ! నిన్ను చంపాలని వుంది నామీద చెయ్యి చేసుకున్నవాడు ఎవడూ ప్రాణాలతో వుండడు. కాని యిప్పుడు కాదు. సమయం వస్తుంది."

"బాస్ ఈ రాజు చాలా డేంజరస్. వొద్దు. వెంటనే మీకు మనసు రాకపోతే నేను" అని హాండ్‌బాగ్‌లోంచి రివాల్వర్ తీసింది. మీట మీద వేలు పెట్టింది.

"అతన్ని చంపాలని నీకు అంత కసిగా వుంటే కానియ్యి" అన్నాడు డాక్టర్.

"ఢాం ఢాం ఢాం" మూడుసార్లు పేల్చింది పిస్తోలు లాలన.

"నీ కసి తీరిందా? నీకు తృప్తా?" అడిగాడు డాక్టర్ శ్రీకాంత్.

లాలన తల వూపింది. రాజు నేలమీద పడున్నాడు రక్తపు మడుగులో.

"యు ఆర్ ఏ వెరీ గుడ్ షాట్" అని నవ్వి, "ప్రాణానికి ఆపద లేకుండా మనిషి కొన్నాళ్ళపాటు కదలకుండా షూట్ చేశావు. మూడు గుళ్ళు"  మోకాళ్ళ మీదికి వొంగి పరీక్ష చేసి, "రెండు పిక్కలలో, ఒకటి తొడలో అందుకే అంత రక్తం. ఆపరేషన్ థియేటరుకి తీసుకుని వెళ్ళాలి" అన్నాడు డాక్టర్. మూలుగుతున్నాడు రాజు. "ఎలాగూ చంపుతారు. యెందుకు ఈ శ్రమ కూడా?" అడిగాడు రాజు.

"ప్రస్తుతం నీ ప్రాణానికి చాలా విలువ వుంది" అన్నాడు శ్రీకాంత్.

రాజుని సర్జరీ గదిలో వుంచి, లాలన, డాక్టర్ శ్రీకాంత్ బయటికి వచ్చారు. డాక్టర్ మనుష్యల్లో ఒకతను వచ్చి, ఒక కవరు యిచ్చాడు. శ్రీకాంత్ చదివి "లాలన! మనం అపజయం పొందాం. ప్రాణాలతో యీ దేశాన్నించి తప్పించుకుంటే అదృష్టవంతులం" అన్నాడు.

"ఏం జరిగింది?" అడిగింది లాలన ఆదుర్దాగా.

లాలనకి జవాబు చెప్పకుండా డాక్టర్ శ్రీకాంత్ టెలిఫోన్ తీశాడు ."హల్లో ఐ.జి ఆఫీసా? డిటెక్టివ్ యుగంధర్‌గారు వున్నారా? నా పేరు డాక్టర్ శ్రీకాంత్. వెంటనే ఆయనతో మాట్లాడాలి. యస్." లాలన ప్రశ్నార్థకంగా చూసింది.

"యుగంధర్ మరణించలేదు. ఇప్పుడే వార్త వచ్చింది మన మనిషి ద్వారా. అంతకన్నా చెడు వార్త వచ్చింది" అని,

"యస్, హలో యుగంధరా! ఇక దాపరికం అనవసరం. ఇంటర్‌పోల్ ఏశియాటిక్ డివిజన్ ఛీఫ్ గ్రహాం వచ్చారనీ, మైక్రో ఫిలిం డీకోడ్ చేశారనీ తెలుసు. నన్ను పట్టుకునేందుకు మీరు బయలుదేరుతున్నారా? జస్ట్ ఒన్ సెకండ్. నే చెప్పే విషయాలు జాగ్రత్తగా వినండి. నా యిల్లు చాలా పెద్దది. పెద్ద ప్రహరీగోడ, గేటు వున్నాయి. నా దగ్గర నిపుణులయిన ఎలక్ట్రానిక్, ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్స్ వున్నారు. మీ అసిస్టెంటు రాజు వున్నాడు. అంతేకాదు, యెత్తువచ్చిన అరవైరెండు మంది యువతులున్నారు. మీరు ఈ ఇంటి ప్రాంతాలకి వచ్చారా యీ యిల్లు ఆ క్షణంలోనే పేలిపోతుంది. డైనమైట్ పెట్టించాను. అది యిగ్నయిట్ కావడానికి ఎలక్ట్రానిక్ కంట్రోల్ ఏర్పాటు చేశాను. అవును యుగంధర్. వాళ్ళతోపాటు మేమూ మరణిస్తాము. తప్పదు. మీ చేతుల్లో చిక్కడం కన్నా చావే మేలు. అది మా సిద్ధాంతం" అన్నాడు డాక్టర్.

"డాక్టర్ శ్రీకాంత్ అనవసరమైన భయాలు పెట్టుకుని యితర్లని చంపి, మీరు, మీ బలగం చావనవసరంలేదు. మా దేశంలో గూఢచారులని కూడా చంపము. విచారణ జరిపి, శిక్ష విధిస్తాము. అంతే. దయచేసి గొడవ చెయ్యకుండా సరెండర్ అవ్వండి" అన్నాడు యుగంధర్.

"తెలుసు యుగంధర్ మీది డెమోక్రసీ అనీ, న్యాయానికీ, ధర్మానికీ విలువ యిస్తారనీ, బుద్ధుడు, గాంధీ పుట్టిన దేశం అనీ, అదంతా దేనికి? రాజుని నా పార్టనర్ లాలన షూట్ చేసింది" అన్నాడు డాక్టర్ శ్రీకాంత్.

"అంటే – రాజు.."

"డోంట్ వర్రీ రాజు యింకా చావలేదు. పిక్కలలో రెండు గుళ్ళూ, తొండలో ఒక గుళ్ళు తగిలాయి. బాగా గాయపడ్డాడు.గుళ్ళు తీసేశాను. ప్రమాదం లేదు."

"థాంక్స్ మీ వృత్తి ధర్మం మాననందుకు."

"థాంక్స్ అవసరం లేదు .నేను చెప్పే విషయాలు జాగ్రత్తగా వినండి. నేను వున్న యింటికి డైనమైట్ పెట్టాననీ, క్షణంలో పేలిపోయే యేర్పాటు చేశాననీ చెప్పానుగా. ఇక నా షరతులు వినండి. నేను, లాలన మాతోబాటు రాజు ముగ్గురం మా కారులో ఆ యింట్లోంచి బయలుదేరుతాము. రాజు తలమీద పిస్తోలు పట్టుకుని తయారుగా వుంటుంది లాలన. నా చేతిలో ఆ యిల్లు పేల్చడానికి అవసరమైన ఎలక్ట్రానిక్ కంట్రోల్ పెట్టుకుంటాను. స్విచ్ నొక్కానంటే ఆ యిల్లు పేలుతుంది. ఇటువంటి పరికరాలున్నాయని మీకు నేను చెప్పనవసరం లేదనుకుంటాను" అన్నాడు డాక్టర్ శ్రీకాంత్.

"చెప్పండి వింటున్నాను."

"మేము ఆ యింట్లోంచి వెళుతున్నప్పుడు మీ యిష్టం. మీరు, ఐ.జి గ్రహాం,యింకా ఎందరు పోలీసులు అవసరమైతే అందరూ గేటు దగ్గర నిలబడి మాకు వీడ్కోలు యివ్వండి. ఆ యింటి గేటు ప్రాంతాలకి కాని, ప్రహరీ గోడ దూకడానికిగాని

ప్రయత్నం చేశారంటే, ఆటోమాటిక్ సర్క్యూట్ బ్రేక్ అయి యిల్లు పేలిపోతుంది. అటువంటి పిచ్చిపని చెయ్యకండి. అరవై రెండుమంది యువతుల ప్రాణాలనీ బలి యివ్వకండి."

"తర్వాత?" అడిగాడు యుగంధర్.

"మా కారుని వెంబడించటం కార్లలోనో, మోటారు సైకిళ్ళలోనో, హెలికాప్టర్లలోనో, విమానాలలోనో – అటువంటి పని చెయ్యకూడదు. చేస్తే ఆ క్షణం ఎలక్ట్రానిక్ స్విచ్ నొక్కుతాను. ఆ యిల్లు పేలిపోతుంది .రాజుని చంపేస్తాను."

"ఊ!"

"ఆ యింటి ఎలక్ట్రిక్ మెయిన్స్‌కి మేము కంట్రోల్సు కనెక్టు చెయ్యలేదు. బాటరీలు ఏర్పాటు చేశాము. సరిగ్గా మూడు గంటలలో బాటరీలలో కరెంటు అయిపోతుంది. మూడు గంటల తర్వాత ఏ ఆపదా లేకుండా మీరు నా ఇంట్లోకి వెళ్ళి ఆ యువతులని విడిపించవచ్చు.

"రాజు?"అడిగాడు యుగంధర్.

"మేము మా గమ్యస్థానం చేరుకున్న తర్వాత రాజుని వదిలేస్తాము."

"రాజుని చంపరని ఏమిటి నమ్మకం?"

"రాజుని చంపితే మాకు ప్రయోజనం ఏమిటి? చంపము. హామీ యిస్తున్నాను. నా మాట నమ్మాలి. అంతే. ఆలోచించండి. ఆలోచించి మీ యిష్టం వచ్చినట్లు చెయ్యండి. అరవై రెండుమంది యువతుల ప్రాణాలు, రాజు ప్రాణం ఒక వైపు. నేనూ, లాలనా మీకు చిక్కడం ఒకవైపు. ఏది మీకు వివేకమైన పనో మీరు నిర్ణయించుకోండి" అని డాక్టర్ శ్రీకాంత్ రిసీవర్ పెట్టేశాడు.

"అసలు యీ డాక్టర్ శ్రీకాంత్ ఎవరు? ఆ యువతులని ఎందుకు అంత దారుణంగా హత్య చేయించాడు? ఆ హత్యలకీ, కొకెయిన్‌లాటి మత్తుమందులు పంచిపెట్టడానికీ సంబంధం ఏమిటి? నాకు అంతా గందరగోలంగా వుంది" అన్నాడు ఐ.జి.

"అవును. ఈ క్షణం వరకు నాకు అంతా గందరగోళంగానే వుంది. ఇప్పుడే ముఖ్యమైన అంశాలు అర్థమయ్యాయి. నేను గ్రహించినవీ, ఊహించినవీ చెబుతాను. పుండరీకాక్షయ్యది తార్చే వృత్తి. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ నగరాలలో కొంతకాలంపాటు వున్నాడు. పోలీసుల దృష్టిలోకి రాగానే, ఆ వూరునించి వెళ్ళి, యింకో ఊరిలో తన వృత్తి ప్రారంభించాడు. అలా మద్రాసు నగరం చేరుకున్నాడు.

డాక్టర్ శ్రీకాంత్, భారతీయుడు కాదు. ప్లాస్టిక్ సర్జరీ చేసుకుని భారతీయుడిలా తయారయ్యాడు. కాని నిజంగానే అతను ఒక గొప్ప సర్జను. అతను ఏ దేశం గూఢచారో నేను చెప్పనవసరంలేదు. మీరు వూహించగలరు. డాక్టర్ శ్రీకాంత్ భారతీయ భాషలు ధారాళంగా మాట్లాడగలడు. పుండరీకాక్షయ్య మద్రాసు చేరుకున్న తర్వత, "తార్చే" వృత్తిలో అతనికి

చాలా అనుభవమూ, నైపుణ్యమూ వున్నవనీ, కొత్త కొత్త యువతులని రంగంలోకి తీసుకురాగల సమర్థుడనీ డాక్టర్ శ్రీకాంత్‌కి తెలిసింది. డబ్బుకోసం ఏ నీచమైన పనయినా చెయ్యడానికి సందేహించని పుండరీకాక్షయ్య. డాక్టర్ శ్రీకాంత్ ముఠాలో చేరాడు. డాక్టరు శ్రీకాంత్ ఆజ్ఞానుసారం నడుచుకునేవాడు. తల్లి, తండ్రీ యితర దగ్గర బంధువులు లేని యువతులనీ, విన్నవారిని గురించి చింతించని, అనాధ యువతులని ఎలాగో వలలోవేసి, ఎలాగో వృత్తిలో దింపి, కొన్నాళ్ళ తర్వాత ఆ యువతులు, అందమైన వారూ, లైంగిక సుఖం యివ్వడంలో ఆరితేరినవారూ అయితే, వార్ని మరో దేశానికి ఎగుమతి చేసేవారు.

ఈ వ్యాపారంలో పుండరీకాక్షయ్య డాక్టర్ శ్రీకాంత్‌కి సహాయం చేసేవాడు. అయితే యిది కేవలమూ సయిడ్ బిజినెస్. అసలు కార్యక్రమం, ఆ గూఢచారులది. మీకు గ్రహం చెప్పారుగా ఆ యువతుల ద్వారా, రకరకాల మత్తు కలిగించే మందులని వయస్సులో వున్న పురుషులకి యిచ్చి, వారిని మత్తుమదులకి దాసులని చేసి తర్వాత, వారి ద్వారా యితర్లకి ఆ మందులు సరఫరా చేసి, కొన్ని సంవత్సరాలలో భారతదేశంలోని అధిక సంఖ్యాకులకి యీ మత్తుమందులు అలవాటు చెయ్యడం. ఒకసారి యీ మత్తుమందులకి అలవాటు పడితే, మళ్ళీ ఆ అలవాటునించి తప్పుకోవడం అసాధ్యం.

ఇక జయశ్రీ, సుమిత్రల హత్య విషయం. సుమిత్ర భర్త సత్యం సుమిత్రని తీసుకు వెళతాడని పుండరీకాక్షయ్య డాక్టర్ శ్రీకాంత్‌కి చెప్పాడు. సుమిత్రద్వారా అసలు విషయం సత్యంకి తెలిసి, సత్యం ఎక్కడ అధికారులకి చెపుతాడో అని డాక్టర్ శ్రీకాంత్ భయపడ్డాడు. సత్యాన్ని హత్య చేయిస్తే అనుమానం పుండరీకాక్షయ్య మీదకి వెళ్ళి, కంప అంతా కదులుతుంది. అందువల్ల సుమిత్రని హత్య చేయించాలనుకున్నాడు. భయం కొద్దీ జయశ్రీ నిజం ఎవరితోనైనా చెపుతుందేమోనని, జయశ్రీని యింకో దేశానికి ఎగుమతి చేస్తానన్నాడు డాక్టర్ శ్రీకాంత్. పుండరీకాక్షయ్య అంగీకరించలేదు. పుండరీకాక్షయ్య గురించి డాక్టర్ శ్రీకాంత్‌కి భయంలేదు. ఆ రాత్రి యిద్దర్ని పంపాడు పుండరీకాక్షయ్య యింటికి. తెల్లారగట్ట, పుండరీకాక్షయ్య షికారుకి వెళ్ళిన తర్వాత వారిద్దరూ జయశ్రీని, సునీతనీ గాఢనిద్రలో వుండగా చెరొక కత్తితో పొడిచి చంపేశారు. ఇతర యువతులు భయపడడానికి రక్తం గోడలకి పూసి, భయంకర దృశ్యం కల్పించారు. సత్యం కత్తిని సుమిత్ర వక్షస్థలంలోంచి తీసిన తర్వాత, పుండరీకాక్షయ్య కనకమ్మలు రాగానే కత్తి అక్కడే పారేసి పారిపోయాడు. ఆ రెండు హత్యలు ఎవరు చేశారో పుండరీకాక్షయ్య గ్రహించాడు. కాని, ఆ నేరం సత్యం మీదకి రావాలనే దురుద్దేశంతో ఆ రెండు కత్తులనీ పుండరీకాక్షయ్యని బెదిరించాడు. బహుశా బలప్రయోగం చేసి వుంటాడు. తనని రాజు చంపేస్తాడని బెదిరిపోయిన పుండరీకాక్షయ్య రాజుకి నిజం చెప్పేశాడు. అన్ని రహస్యాలూ తెలుసుకున్న రాజు, ఆ తొందరలో తన కత్తి, సిగరెట్ లైటర్ ఆ గదిలో మర్చిపోయి వెళ్ళిపోయాడు. అంతేకాదు తనకై తను దర్యాప్తు చెయ్యాలనీ, కాత్యాని కాపాడాలనీ, రాజు ఒంటరిగా డాక్టర్ శ్రీకాంత్ యింటికి వెళ్ళకుండా, తిన్నగా నా దగ్గరకి వచ్చి, తను తెలుసుకున్న విషయాలు చెప్పివుంటే రాకపోవడమే మంచిదయింది. కాత్యాని పుండరీకాక్షయ్య యింట్లోకి వెళ్ళడం శ్రీకాంత్ ముఠా మనిషి చూసి

డాక్టర్ శ్రీకాంత్‌కి చెప్పాడు. రాజు పుండరీకాక్షయ్యనించి రహస్యాలు తెలుసుకుని వుంటాడని అనుమానించి, రాజు బయటికి రాగానే తన మనిషి, ఆడవేషంలో కనకమ్మలా ఆ యింట్లోకి పంపి, పుండరీకాక్షయ్యని హత్య చేయించాడు అయినా, ఎందుకయినా రాజుని ఓ కంట కనిపెట్టడానికి మనుష్యులని నియమించాడు శ్రీకాంత్. రాజు నా వద్దకు కానీ, పోలీసుల వద్దకి కానీ వెళ్ళే ప్రయత్నం చేసివుంటే, నడిరోడ్డు మీద కాల్చి చంపేసేవారు. అంతేకాదు. మిగతా స్త్రీలు ఎవరయినా, నిజం అధికారులకి చెప్పేస్తారేమోనని, అందరికీ జయశ్రీ, సుమిత్రల ఫోటోలు ఘోరంగా హత్య చెయ్యబడినవి బెదిరింపుతో పంపాడు. ఆ బెదిరింపు లక్ష్యపెట్టని రాధనీ, రోజీనీ హత్య చేయించాడు. ఆఖరికి ఎప్పుడయితే మిగతా స్త్రీలకి మనం రక్షణ ఏర్పాటు చేశామో, అప్పుడు డాక్టర్ శ్రీకాంత్ బెదిరిపోయాడు. ఏ స్త్రీ భయపడి నిజం చెప్పేస్తుందో అని. ఆ అరవై రెండుమంది స్త్రీల ప్రాణాలు, రాజు ప్రాణం ఒకవైపు, తను, తన సహకర్త లాలన ప్రాణాలు ఒకవైపు, బేరం పెడుతున్నాడు" అన్నాడు యుగంధర్. పత్రికా విలేఖరుల సమావేశం రద్దు చేశారు.

"ఏమిటి మీ సలహా?" అన్నాడు ఐ.జి.

"థాంక్‌యు, నా మీద అంత నమ్మకం పెట్టుకున్నందుకు" అని, టెలిఫోన్ తీశాడు. "హల్లో యుగంధర్ హియర్. డాక్టర్ శ్రీకాంత్. ఒక నిర్ణయానికి వచ్చాము. మీరు మీ యింటినించి యెన్ని గంటలకు బయలుదేరతారో చెప్పండి. ఆ సమయానికి నేను, పోలీసు బలగమూ మీ యింటి గేటూ ముందు నిలుచుని మీకు వీడ్కోలు యిస్తాము. నో! నో! మిమ్మల్ని ఆపడానికీ, పట్టుకోడానికీ ప్రయత్నించము. తెల్సుగా అలా ప్రయత్నిస్తే ఎందరి ప్రాణాలు పోతాయో" అన్నాడు యుగంధర్.

"వెరీగుడ్ మాట తప్పరని అనుకుంటాను. తప్పితే"

"దటీజ్ ఎనఫ్" అన్నాడు యుగంధర్.

"సరిగ్గా యింకో గంటలో బయలుదేరుతాను. మరొక్కసారి" అంటున్నాడు శ్రీకాంత్.

"మిమ్మల్ని వెంబడించటానికి యెటువంటి ప్రయత్నమూ చెయ్యము" అన్నాడు యుగంధర్.

తన అనుచరులనందర్నీ హాలులోకి పిలిపించాడు డాక్టర్ శ్రీకాంత్.

"డియర్ కామ్రేడ్స్ మన పథకంపారలేదు. తల కిందులయింది. అందరం పోలీసులకి చిక్కే ప్రమాదంలో వున్నాము" అన్నాడు.

శ్రీకాంత్ అనుచరులు ఇరవైమందీ, ఏజంటు త్రీతో సహా ఒక్కసారిగా మూలిగారు.

"మిమ్మల్ని ప్రమాదానికి గురిచేసి నేను తప్పించుకుని పారిపోతున్నాననుకోకండి. ఇంకో అరగంటలో నేను, లాలన, మాతో యుగంధర్ ఐస్టెంట్ రాజుని కూడా తీసుకుని వెళుతున్నాము. మేము బయలుదేరి వెళ్ళిన మూడు గంటల తర్వాత

యుగంధరూ, పోలీసులు యింట్లో ప్రవేశిస్తారు. మీరెవరూ దౌర్జన్యం చేయకండి. వాళ్ళని రానివ్వండి. మిమ్మల్ని అరెస్టు చెయ్యరు. వొదిలేస్తారు" అన్నాడు శ్రీకాంత్.

"ఎందుకు వొదిలేస్తారు?" అడిగాడు ఏజంటు త్రీ.

"అందుకే రాజుని మాకూడా తీసుకుని వెళుతున్నాము. మిమ్మల్ని యిరవై మందినీ వొదిలేస్తే రాజుని వొదులుతాననీ, లేకపోతే –"

"మమ్మల్ని వొదిలినట్లు మీకెలా తెలుస్తుంది?" అడిగాడు త్రీ.

"త్రీ! నీకు ఒక్కడికే తెలుసు మన రహస్య విమానాశ్రయం. మీకోసం నేను కాచుకుంటాను. మిమ్మల్ని వెంబడించకుండా ఆటంకపరచకుండా వుండేందుకు హెచ్చరిక ఇస్తాను" అన్నాడు శ్రీకాంత్.

"ఏర్పాట్లన్నీ చేశారా?" అడిగాడు యుగంధర్.

"నేనే స్వయంగా చేశాను. ఇదిగో మీరు అడిగినవి. ఎలక్ట్రానిక్ డిపార్టుమెంట్ వారు యిచ్చారు. దాదాపు వందమైళ్లవరకూ సిగ్నల్ వినిపిస్తుందట.

"గుడ్! పదండి" అన్నాడు యుగంధర్.

సరిగ్గా సాయంకాలం అయిదుగంటలయింది. డాక్టర్ శ్రీకాంత్ యింటిముందు ఆరు పోలీస్‌వాన్‌లు, నాలుగు పోలీసు జీప్‌లూ, ఐ.జీ పోలీసు వాన్ వచ్చి ఆగాయి. గేటుకి రెండు పక్కలా వరసగా పోలీసులు బారులుగా నిలుచున్నారు. గేటుకి కొంచెం దూరంలో ఐ.జి, డి.ఐ.జి, యుగంధర్ గ్రహం, యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు నిలుచున్నారు.

అయిదు గంట అయిదు నిమిషాలకి గేటు తెరుచుకుంది. ఎవరూ తెరవలేదు. రిమోట్ కంట్రోలుతో తెరవబడింది .వేగంగా కాదు, నెమ్మదిగా మెర్సిడిస్ బెంజ్‌కారు వస్తోంది. ముందు డ్రైవింగ్ సీటులో డాక్టర్ శ్రీకాంత్ పక్కన యుగంధర్ అసిస్టెంట్ రాజు, వెనక సీటులో లాలన. రాజు తలమీద వెనక పిస్తోలు ఆనించి పెట్టుకుని కూర్చున్నది. కారు గేటు దగ్గరికి  వచ్చింది. క్షణం ఆగి ముందుకు కదిలింది. వెంటనే గేటు మూసుకున్నది. కారు స్పీడు వేగం పెరిగింది. శ్రీకాంత్ కరకరమని గేర్స్ మార్చాడు. తన ముందు నుంచి కారు వెళుతోంది. ఇక ఆలస్యం చెయ్యడానికి వీలులేదు. అంతేకాదు గురి తప్పకూడదు. పెద్ద చప్పుడు కాకూడదు. చేతిలో వున్న చిన్న అగ్గిపెట్టంత ఒక డబ్బాలాటి దాన్ని వెళ్ళిపోతున్న కార్ వెనక బంపర్ మీదికి విసిరాడు యుగంధర్.

యుగంధర్ విసురుతున్నప్పుడు అందరూ వూపిరి బిగపట్టారు. కారుకి తగులుతుందా! బంపర్‌కి అతుక్కుంటుందా! మాగ్నట్ వున్నది. అయినా గురి తప్పి కిందపడుతుందా? మరీ గట్టిగా విసిరితే చప్పుడవుతుందా?

ఏదీ కాలేదు. ఆ డబ్బా బంపర్‌కి అతుక్కున్నది. పరీక్షగా చూస్తే కానీ యెవరికీ కనిపించదు. బంపర్‌లా అదీ వెండిలా మెరుస్తోంది.

కారు వేగంగా ట్రంకు రోడ్డుమీద పోనిచ్చాడు శ్రీకాంత్. పక్కనించీ, వెనకనించీ, కార్లు బస్సులు, లారీలు, సైకిళ్ళు, స్కూటర్లు, యెద్దుబళ్ళు వెళుతున్నాయి.

"ఈ వాహనాలలో పోలీసులు" అంటోంది లాలన.

"ఆ భయంలేదు. అన్ని ఏర్పాట్లు చేసే వ్యవధి యివ్వలేదు నేను. అంతేకాక మనని ఆపితే యిక్కడ రాజునీ, అక్కడ అరవైమంది స్త్రీలనీ బలి యిస్తామనే భయం వుండదూ. మూడుగంటలవరకూ మనకి ఏ ప్రమాదం లేదు" అన్నాడు శ్రీకాంత్.

"తర్వాత?" అడిగింది లాలన.

శ్రీకాంత్ నవ్వాడు. "మనం ఆకాశంలో ఎగిరిపోతాం."

"మన అనుచరులు?"

శ్రీకాంత్ మళ్ళీ నవ్వాడు. "వాళ్ళు గొడవ చెయ్యకుండా వుండేందుకు అలా చెప్పాను. అంతే, వాళ్ళు పోలీసులకి చిక్కినా మనకి యిబ్బంది లేదు. వాళ్ళ కోసం మనం కాచుకోవడం ఫూలిష్. యుగంధర్ సమర్ధతని మరీ తక్కువ అంచనా వెయ్యకూడదు."

"అయితే యీ రాజుని యిక్కడెక్కడో కాల్చి, శవాన్ని రోడ్డు పక్కన..." అడిగింది లాలన.

"అవును. అది వివేకమైన పని. కాని అంతకన్నా వివేకమైన పని మనం విమానం యెక్కేంతవరకూ రాజుని ప్రాణాలతో వుంచడం. ఏ క్షణాన ఏమవుతుందో? రాజు ప్రాణాన్ని బేరం పెట్టడానికి రాజు ఆఖరి క్షణం వరకూ బతికే వుండాలి" అన్నాడు శ్రీకాంత్.కారు స్పీడు పెరిగింది.

డి.ఐ.జి మీరు యిక్కడే వుండండి. సరిగా మూడుగంటలు కాచుకోండి.మూడు గుంటలు దాటగానే ఎందుకయినా మంచిది, ముందు యీ యింటి ఎలక్ట్రిక్ సప్లయ్ మెయిన్ కట్ చేయించి తర్వాత హెడ్ క్వార్టర్స్‌కు ఫోన్ చేసి 'సరే ' అని చెప్పిన తర్వాత యీ ఇంట్లోకి ప్రవేశించి అందర్నీ కస్టడీలోకి తీసుకోండి. యెవర్నీ పారిపోనివ్వద్దు" అని యుగంధర్ ఐ.జి కారు యెక్కాడు. అది పోలీస్ కంట్రోల్ రూం. లౌడ్ స్పీకర్లోంచి బీప్ బీప్ అనే శబ్దం బాగా బిగ్గరగా వినపడుతోంది. టెలివిజన్ స్క్రీనులాంటి ఒక స్క్రీను మీద వరసగా గీతలున్నాయి. అవి మద్రాసు నించి వెళ్ళే రోడ్ల గీతలు. ఒక గీత మీద ఒక నల్లని చుక్క వేగంగా కదులుతోంది.

"మీ యెలక్ట్రానిక్ నిపుణులని మెచ్చుకోవాలి. స్వల్పకాలంలో అన్ని ఏర్పాట్లు చేశారు. నేను శ్రీకాంత్ కారు బంపరు మీదకి విసిరినది ఎలక్ట్రానిక్ సిగ్నల్ కాప్స్యూల్. శబ్దాన్ని బట్టి కారు యెటు వెళుతున్నదీ యెంత వేగంగా వెళుతున్నదీ తెలుస్తుంది. చూడండి ఐ.జి. ఇప్పుడు గ్రాండ్ ట్రంక్ రోడ్డు మీద వెళుతోంది. వ్యాసరపాడుకి దగ్గర అవుతుంది మిస్టర్ గ్రహాం మీకు చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను. ఈ విషయాలన్నీ మీకు తెలిసినవే" అన్నాడు యుగంధర్.

"అవును. కాని, డాక్టర్ శ్రీకాంత్‌నీ, ఆ యువతిని యెలా పట్టుకుంటారు? రాజుని యెలా రక్షిస్తారు? మీ పథకం నాకు తెలియడంలేదు" అన్నాడు గ్రహాం.

"సార్జంటు శివం చాలా సమర్ధుడు.ఆతనికి అప్ప చెప్పాను ఆ పని" అన్నాడు యుగంధర్.

"వాట్ ఒక సార్జంటుకా?" అడిగాడు ఐ.జి.

"సార్జంటు శివం ఒక ట్రాన్స్‌పోర్టు లారీ తీసుకుని గ్రాండ్ ట్రంకు రోడ్డు మీద వెళుతున్నాడు. అతని లారీకి ఎలక్ట్రానిక్ సిగ్నల్ ఏర్పాటు చేశాము. అతనికి శ్రీకాంత్ కారు సిగ్నల్ వినపడుతుంది. మనకి సార్జంటు లారీనించి యింకోరకమైన సిగ్నల్ బర్ బర్‌మని వినపడుతుంది" అన్నాడు యుగంధర్.

"వినపడితే?" అడిగాడు స్వరాజ్యరావు.

"స్క్రీన్‌వైపే చూస్తూ వుండండి ఏం జరుగుతుందో? చుక్క వేగంగా వెళుతోందే అది శ్రీకాంత్ కారు. వెనక ఏదో గుర్తు చూపిస్తూ కదులుతున్నది సార్జంటు లారీ" అంటున్నాడు యుగంధర్.

చుక్కకి దగ్గర అయింది లారీ, చుక్క రోడ్ పక్కకి జరిగింది. లారీ కాస్త తికమకయి వెళ్ళి ఆ ప్రక్కకి తగిలింది. చుక్క కదలడం లేదు. యారో కదలడం లేదు.

"ఏమైంది?" అడిగాడు ఐ.జి.

## ( ముగింపు వచ్చే నెలలో)

Post your comments